
సాక్షి గుంటూరు

మంగళవారం । 28 । నవంబర్ । 2023



మహాకుంభాభిషేకం ప్రారంభం

పొన్నూరు: సాక్షి భావనారాయణస్వామి గుడిలో మహా కుంభాభిషేక మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే కిలారి రోశయ్య దంపతులు పాల్గొన్నారు.



హంసలదీవి తీరానికి నాగశిలలు

కోడూరు: హంసలదీవి సాగరతీరానికి నాగశిలలు, నవగ్రహమూర్తుల విగ్రహాలు సోమవారం కొట్టుకువచ్చాయి. వీటికి భక్తులు పూజలు చేశారు.

అభయాంజనేయస్వామికి విశేష పూజలు



కర్లపాలెం: కార్తిక పౌర్ణమి సందర్భంగా తుమ్మలపల్లి గ్రామం అడవిలో ఉన్న అభయాంజనేయ స్వామికి సోమవారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

న్యూస్‌రీల్

పలు రైళ్లు రద్దు

లక్ష్మీపురం(గుంటూరువెస్ట్): గుంటూరు డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేసినట్లు సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయగడ్–గుంటూరు (17244) ఎక్స్‌ప్రెస్ రైలు, గుటూరు–రాయగడ్(17233) ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్–సికింద్రాబాద్(17015) ఎక్స్‌ప్రెస్‌లను డిసెంబర్ 4వ తేదీన రద్దు చేసినట్లు తెలిపారు. సికింద్రాబాద్–భువనేశ్వర్(17016), హౌరా–చెన్నై సెంట్రల్(12839), చెన్నై సెంట్రల్–హౌరా(12840), వాస్కోడిగామా–షాలీమార్ (18048) ఎక్స్‌ప్రెస్ రైళ్లను డిసెంబర్ 3వ తేదీన రద్దు చేసినట్లు తెలిపారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్–2023

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ యూనివర్సిటీ ఆవరణలో ఈనెల 29, 30వ తేదీల్లో 31వ రాష్ట్రస్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్–2023 నిర్వహించనున్నట్లు రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక మండలి సభ్య కార్యదర్శి డాక్టర్ వై.అపర్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ టెక్నాలజీ కమ్యూనికేషన్స్, రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక మండలి(అప్‌కాస్ట్), పాఠశాల విద్యాశాఖ, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, కందుకూరుకు చెందిన సీకే దాస్ అకాడమి, చారిటబుల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, కోనేరు లక్ష్మయ్య, ఎడ్యుకేషనల్ ఫౌండేషన్‌ల సహకారంతో సైన్స్ కాంగ్రెస్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాద రావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), పలువురు ఉన్నతాధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు.

యార్డుకు 35,423 బస్తాల మిర్చి రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 35,423 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 34,308 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 24,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.8,500 నుంచి రూ.21,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,000 నుంచి 23,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 11,420 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 524.20 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎడమ కాలువకు 1,539, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 23,765, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 839.00 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయానికి రోజా నుంచి 1,824 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

పోటీ పరీక్షలకు పుస్తకాలు సిద్ధం చేయండి



గుంటూరుఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో గ్రూప్–1, 2 నోటిఫికేషన్లు విడుదల చేయనున్న దృష్ట్యా పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన ప్రామాణిక పుస్తకాలను సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. సోమవారం అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించిన జేసీ రాజకుమారి అన్ని విభాగాలను పరిశీలించారు. పోటీ పరీక్షల విభాగంలో నిరుద్యోగులతో మాట్లాడి, వారికి ఎటువంటి స్టడీ మెటీరియల్, ప్రామాణిక పుస్తకాలు అవసరమనే విషయాన్ని తెలుసుకున్నారు. అన్ని రకాల పుస్తకాలు, గ్రంథాలను సిద్ధంగా ఉంచి, పాఠకులకు అవసరమైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. గ్రంథాలయ సెస్ చెల్లించేలా స్థానిక సంస్థల అధికారులకు తగు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. ఆమె వెంట జిల్లా గ్రంథాలయసంస్థ కార్యదర్శి కె.ఝాన్సీలక్ష్మి ఉన్నారు.

శుభః శివాయ




పెదకాకాని మల్లేశ్వరస్వామి

పున్నమి చంద్రుడు వెన్నెల నవ్వులొలికినట్టు.. మంచుముత్యాలు విరిజల్లులై కురిసినట్టు.. పుణ్యజలసిరులు జీవధారలై అభిషేకించినట్టు.. వేదమంత్రాలు దివ్యాశీస్సులై ఘోషించినట్టు.. దీపారాధనలు హరివిల్లులై విరిసినట్టు.. మహాదేవుని మోము కోటికాంతులతో మెరిసినట్టు.. కార్తిక పౌర్ణమి శోభతో శైవక్షేత్రాలు తళుకులీనాయి. ఆధ్యాత్మికోత్సాహం వెల్లివిరిసింది. ఓం నమఃశివాయ.. శంభోశంకర అంటూ ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రణమిల్లింది. భక్తిపారవశ్యంతో పులకించింది.



అమరేశ్వరా.. నమో : విశేషాలంకారంలో అమరేశ్వరుడు

కోటప్పకొండ కిటకిట



భక్తజన 'కోటప్ప' : కొండపై కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు



త్రినేత్రాయ.. త్రికోటేశా.. : ప్రత్యేక అలంకరణలో త్రికోటేశ్వరుడు

నరసరావుపేట రూరల్: పవిత్ర కార్తిక పౌర్ణమి, సోమవారం కలిసి రావడంతో ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ భక్తులతో పోటెత్తింది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు త్రికోటేశ్వరుడిని దర్శించుకుని తరించారు. తెల్లవారుజాము నుంచే స్వామి దర్శనం కోసం భక్తులు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. అయ్యప్ప మాలధారులు కొండ మీద రాత్రి నిద్రచేసి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నాలుగు గంటలకు స్వామికి విశేష అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉచిత దర్శనంతోపాటు శీఘ్ర దర్శనం, ప్రత్యేక దర్శనం, అభిషేక దర్శనాన్ని భక్తులకు కల్పించారు. అభిషేక మండపంలో భారీగా అభిషేకాలు జరిగాయి. మహిళలు ఆలయం వెనక ఉన్న రావిచెట్టు, మహానందీశ్వరుడు ప్రతిమ, ఉసిరి చెట్టు వద్ద కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేశారు. నాగేంద్రుని పుట్ట వద్ద భక్తుల తాకిడి నెలకొంది. ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ద్విచక వాహనాలు, కార్లతోపాటు గ్రామాల నుంచి భక్తులు ట్రాక్టర్లపై కొండపైకి రావడంతో పార్కింగ్ స్థలం కిక్కిరిసింది. వాహనాల రద్దీతో ప్రకృతి పర్యాటక కేంద్రం, టోల్‌గేట్ వద్ద పలుమార్లు ట్రాఫిక్ నిలిచిపోయింది. నరసరావుపేట, చిలకలూరిపేట నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపింది. రూరల్ ఎస్‌ఐలు రోశయ్య, హజరత్తయ్య సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దాతలు భక్తులకు ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు. గిరి ప్రదక్షిణలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తెల్లవారుజాము నుంచే గిరి ప్రదక్షిణను భక్తులు ప్రారంభించారు. సోపాన మార్గంలోని గణపతికి పూజలు చేసి గిరిప్రదక్షిణకు శ్రీకారం చుట్టారు. అటవీశాఖతోపాటు పలువురు దాతలు భక్తులకు తాగునీరు అందజేశారు.

పోటెత్తిన పెదకాకాని



ప్రకా'శివాయ': ఓ వైపు దీపారాధనలు చేస్తున్న భక్తులు, మరోవైపు క్యూలైన్లలో దర్శనానికి వెళ్తున్న ప్రజలు



స్వామి దర్శనం.. దివ్య'ప్రసాదం': కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి దంపతులకు స్వామి ప్రసాదం అందజేస్తున్న దృశ్యం

పెదకాకాని: కార్తిక పౌర్ణమి, సోమవారం సందర్భంగా పెదకాకాని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. వేకువ నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. తొలుత యజ్ఞాల బావి వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. కార్తిక దీపాలు వెలిగించారు. స్వామి, దేవేరులను దర్శించుకుని అభిషేకాలు చేశారు. పలువురు భక్తులు ప్రభలతో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరెడ్డి, పాలకమండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పెదకాకాని సీఐ సురేష్‌బాబు బందోబస్తు నిర్వహించారు. ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి దంపతులు స్వామిని దర్శించుకున్నారు.

అమరారామం.. ఆధ్యాత్మికోత్సాహం

అమరావతి: అమరావతి బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయం కార్తిక పౌర్ణమి సందర్భంగా కిటకిటలాడింది. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. తొలుత భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయంలోని ఉసిరిక చెట్టు వద్ద కార్తిక దీపారాధనలు చేశారు. అనంతరం అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఫలితంగా శివపంచాక్షరీ నామంతో అమరేశ్వరాలయం ప్రతిధ్వనించింది. ఉదయం సుమారు 70కిపైగా బస్సులలో తరలివచ్చిన పంచారామ క్షేత్ర సందర్శన యాత్రికులు స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ కార్తిక సోమవారం విశిష్టతను వివరించారు. ఆలయ ఈవో వేమూరి గోపినాథశర్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు. సుమారు 20వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారని సమాచారం. సీఐ ఎ.వి.బ్రహ్మం తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



ఆ'దర్శనీయం' : స్వామి దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

అర్జీలు పెండింగ్ ఉండకూడదు

కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి

గుంటూరు వెస్ట్: అర్జీలు పెండింగ్ లేకుండా 48 గంటల్లోనే పరిష్కరించాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న అర్జీలు ఈ నెలాఖరులోపు క్లియర్ చేయాలన్నారు. డిసెంబర్ 1 నాటికి ఏ శాఖలోనూ అర్జీలు పెండింగ్ ఉండకూడదన్నారు. జిల్లా అధికారులు తమ శాఖల్లోని పెండింగ్ అర్జీలపై దృష్టి సారించాలని చెప్పారు. సుదీర్ఘ కాలం నిర్లక్ష్యంతో అర్జీలు పెండింగ్‌లో ఉంచితే సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు పొందిన సిబ్బంది సీనియర్ల వద్ద పని నేర్చుకోవాలన్నారు. ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని తెలిపారు. అనంతరం వచ్చిన 155 అర్జీలు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, ఆర్డీఓ పి.శ్రీకర్, జిల్లా అధికారులు పరిశీలించారు.

అందరికీ రాజ్యాంగ ఫలాలు

- విలువలకు ప్రాధాన్యమిస్తే ప్రలోభాలు లేని ఎన్నికలు సాధ్యమే
- ప్రభుత్వ పథకాలతో ఆర్థిక పరిపుష్టి
- టెన్త్ తర్వాత ఐదేళ్లు కష్టపడితే ఐదు తరాల భవితను మార్చవచ్చు
- గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు
- ఏఎన్‌యూలో రాజ్యాంగ దినోత్సవం



ప్రసంగిస్తున్న గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు

ఏఎన్‌యూ(గుంటూరు): ఈ దేశంలో మనం పొందుతున్నవన్నీ రాజ్యాంగ ఫలాలేనని గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు చెప్పారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఐజీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐజీ మాట్లాడుతూ మనం రాజ్యాంగాన్ని చదువుతున్నాం కానీ వ్యక్తిగత, కుటుంబ జీవితంలో దానిని పాటించడం లేదని, అందుకే చాలా సమస్యలు వస్తున్నాయన్నారు. ఎంతో విశిష్టత ఉన్న భారత రాజ్యాంగ ఔన్నత్యాన్ని కాపాడి భావితరాలకు అందించాల్సిన బాధ్యత యువతపై ఉందని పేర్కొన్నారు. చట్టం అమలులో ధనిక, పేద, వర్గ, కుల తేడాలు చూపినంతకాలం రాజ్యాంగ లక్ష్యం నెరవేరదన్నారు. యువత విలువలకు ప్రాధాన్యమిస్తే అద్భుతాలు సృష్టించవచ్చని, మద్యం, డబ్బు, కులం, మతం వంటి ప్రలోభాలు లేని ఎన్నికలు చూడవచ్చన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు అణగారిన వర్గాలకు ఇస్తున్న పథకాల వల్ల ప్రజలు సోమరివారవుతారని కొందరు చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదన్నారు. 70 ఏళ్ల కాలంలో రాజ్యాంగ విలువలకు అనుగుణంగా పేదలకు అన్నీ అందితే ఇప్పుడు పథకాలు, ఉచితాలు ఇవ్వాల్సిన అవసరమే ఉండేది కాదన్నారు. పేదలకు పథకాలు అందించడం వల్ల ఆర్థిక పరిపుష్టి సాధ్యమవుతుందన్నారు. గతంలో జరిగిన అవినీతిని దృష్టిలో ఉంచుకునే డీబీటీ(నేరుగా లబ్ధిదారునికి చేరవేత) విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. యువకులు పదో తరగతి తర్వాత ఐదేళ్లు కష్టపడితే ఐదు తరాలను సుఖపెట్టవచ్చని స్పష్టం చేశారు. ఏపీ అగ్రికల్చర్ స్పెషల్ కమిషనర్ సీహెచ్ హరికిరణ్ మాట్లాడుతూ దేశంలోని అన్ని వర్గాల ప్రయోజనాలు పరిరక్షించే నిర్దిష్టమైన అంశాలను అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపరిచారన్నారు. చాలా దేశాల్లో వ్యవస్థలు సంక్షోభానికి గురవుతున్నా మన దేశంలో ఆ పరిస్థితి రాకపోవడానికి మన రాజ్యాంగమే కారణమన్నారు. అంబేడ్కర్ లక్ష్యాలను గుర్తెరిగి యువత రాజ్యాంగ విలువల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. వీసీ పి.రాజశేఖర్ మాట్లాడుతూ ప్రపంచంలోకెల్లా అత్యుత్తమ అంశాలను అంబేడ్కర్ మన రాజ్యాంగంలో పొందుపరిచారన్నారు. రాజ్యాంగం గురించి తెలుసుకోని విద్యార్థులు పరిపూర్ణ పౌరులు కాలేరన్నారు. అనంతరం విద్యార్థులు, అతిథులతో వీసీ రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ, అంబేడ్కర్ అధ్యయన కేంద్రం అధ్యాపకులు అశోక్‌కుమార్, డాక్టర్ అబ్రహం లింకన్, సీడీసీ డీన్ కె.మధుబాబు, పరీక్షల కో–ఆర్డినేటర్ ఆచార్య ఉదయ కుమార్, ప్రిన్సిపాల్స్ సీహెచ్ స్వరూపరాణి, సిద్దయ్య, శ్రీనివాసరెడ్డి, ప్రమీలారాణి ప్రసంగించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు.

భూ సమస్యల పరిష్కారం దేశంలోనే ప్రథమం

- కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి
- అట్టహాసంగా లంక భూములకు పట్టాల పంపిణీ
- 400 మంది లబ్ధిదారులకు ప్రయోజనం



హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి చిత్రంలో ఎమ్మెల్యే శివకుమార్, సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ

తెనాలి: రైతాంగానికి సంబంధించిన అన్ని రకాల భూముల సమస్యలను పరిష్కరించటం రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే ఇది ప్రథమమని, రెవెన్యూ విభాగం చరిత్రలో ఇన్ని సంస్కరణలు మునుపెన్నడూ జరగనే లేదని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. కొల్లిపర మండలం బొమ్మువానిపాలెంలో సోమవారం సాయంత్రం ఏర్పాటైన సభకు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అధ్యక్షత వహించారు. కృష్ణానదిలోని లంక భూములను సాగుచేసుకుంటున్న అన్నవరం, బొమ్మువానిపాలెం, తూములూరు, పాతబొమ్మువానిపాలెం గ్రామాలకు చెందిన 400 మంది రైతులు 20 ఏళ్లకుపైగా సాగుచేసుకుంటున్న 200.21 ఎకరాలకు హక్కు పత్రాలను కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే శివకుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. రైతుల ఇబ్బందులు తెలిసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రకాల భూముల సమస్యలకు పరిష్కారం చూపుతున్నారని గుర్తుచేశారు. మండల కేంద్రాలకు వెళ్లే పని లేకుండా గ్రామాల్లోనే సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిన ఫలితంగా చాలావరకు సమస్యలు తగ్గిపోయాయని చెప్పారు. భూ వివాదాలకు ఆస్కారం లేనివిధంగా రీసర్వే రాష్ట్రంలో పెద్ద ఎత్తున జరుగుతోందని చెబుతూ జిల్లాలో ఇప్పటికే 40 గ్రామాల్లో సర్వే పూర్తిచేసి రైతుల సమక్షంలో ప్రభుత్వ ఖర్చుతో హద్దురాళ్లను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. నిషేధిత భూముల జాబితాలో చేరిన చుక్కల భూముల సమస్య, 21ఏ నిషేధిత జాబితాలో చేరిన భూముల సమస్యలను పరిష్కరించినట్టు వివరించారు. వీటితోపాటు షరతులు గల భూములు, వారసత్వ భూములు, అనాధీనం భూములు, ఎస్సీ కార్పొరేషన్ కొనుగోలు చేసి 669 మందికి ఇచ్చిన 361 ఎకరాలపైనా హక్కులను కల్పించామని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతాంగానికి ఇచ్చిన అసైన్డ్ భూముల్లో వారికి ఎలాంటి హక్కులూ లేకపోవటాన్ని గమనించి వారికి పట్టాల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ క్రమంలో లంక భూముల సాగు రైతులకు సబ్ డివిజన్ చేసి, ఐదేళ్ల కాలపరిమితితో హక్కులను కల్పిస్తూ అడంగల్, ఎఫ్ఎంబీలతోసహా సర్టిఫికెట్లను పంపిణీ చేయటం గొప్ప విషయమన్నారు. ఐదేళ్ల తర్వాత మళ్లీ రెన్యూవల్ చేస్తామని, ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు పట్టాలుగా ఇస్తామని హామీనిచ్చారు.

చారిత్రాత్మకం

తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో రాష్ట్రంలో అసైన్డ్ భూములు సాగుచేస్తున్న 17,768 మంది రైతులకు 9,064 ఎకరాలకు పట్టాల పంపిణీ జరుగుతోందన్నారు. లంక భూముల రైతులకు పట్టాల పంపిణీ చారిత్రాత్మకమన్నారు. వ్యవసాయ సలహా మండలి మండల ఛైర్మన్ బొమ్ము శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా లంక భూములకు పట్టాల కోసం తాము చేస్తున్న కృషి, ఇప్పుడు ఎమ్మెల్యే శివకుమార్, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో నెరవేరిందన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే శివకుమార్ లంక భూముల రైతాంగం సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లటంతో 400 మంది రైతులకు మేలు జరిగిందన్నారు. తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ, కొల్లిపర ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, తెనాలి మార్కెట్‌యార్డు చైర్మన్ అవుతు సీతనగేష్‌రెడ్డి, అన్నవరపులంక, బొమ్మువానిపాలెం, అన్నవరం సర్పంచ్‌లు తోడేటి రాజేశ్వరి, కొల్లి రజని, తోట శ్రీలక్ష్మి, తెనాలి మార్కెట్‌యార్డు చైర్మన్ ఎంపీడీఓ వి.విజయలక్ష్మి, తహసీల్దార్ జి.నాంచారయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరిగ చంద్రారెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, కొల్లిపర, బొమ్మువానిపాలెం కార్యదర్శులు ఆంజనేయప్రసాద్, కె.శంకరయ్య పాల్గొన్నారు.

మంచిమనసుతో పత్రాలను ఇచ్చారు



మాకు లంక భూమి అరెకరం ఉంది. వారసత్వంగా సాగు చేస్తున్నాం. భూమికి సంబంధించి మాకెలాంటి ఆధారాల్లేవు. సీఎం జగన్ మంచి మనసుతో హక్కుపత్రాలను ఇచ్చారు. ఎంతోకాలంగా పరిష్కారం కాని సమస్యను ఆయన తీర్చారు. మళ్లీ ఆయనే సీఎంగా వస్తే శాశ్వతమైన పట్టాలు ఇస్తారని నమ్ముతున్నాం.

– పిల్లి రాజారావు, బొమ్మువానిపాలెం

చాలా సంతోషంగా ఉంది



మా కుటుంబ సభ్యులకు లంకలో 2.20 ఎకరాల భూమి ఉంది. మా అమ్మ కాలం నుంచి సాగుచేస్తున్నాం. మాకెలాంటి పత్రాలూ లేవు. ఇప్పుడు ఎమ్మెల్యే శివకుమార్ చొరవతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాకు హక్కుపత్రాలు ఇచ్చారు. బ్యాంకు లోన్లు వస్తాయి. ఈ–క్రాప్, రైతు భరోసా వంటి సౌకర్యాలన్నీ వస్తాయి. చాలా సంతోషంగా ఉంది.

– పిల్లి లలితకుమారి, బొమ్మువానిపాలెం

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



వెంకటేశ్వరరావు, గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి

గుంటూరుఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో గుంటూరు డివిజన్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నట్లు గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. డీఈవో కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని 107 ప్రభుత్వ, జెడ్పీ, ఎయిడెడ్, గురుకుల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల్లో అధిక మార్కుల సాధనకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అదనపు తరగతుల నిర్వహణతోపాటు విద్యార్థులు రెగ్యులర్‌గా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు సూచించినట్లు చెప్పారు. సబ్జెక్టులను బోధించే ఉపాధ్యాయుల కొరత లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టి, అవసరమైన ఉపాధ్యాయులను సర్దుబాటు చేశామన్నారు. డివిజన్ పరిధిలోని ఉన్నత పాఠశాలల పరిధిలో తనిఖీలు నిర్వహిస్తూ, అకడమిక్ పరంగా ప్రగతి, ఉపాధ్యాయుల బోధనా తీరు, విద్యార్థుల హాజరును నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. గైర్హాజరవుతున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి, వారిని ప్రతి రోజూ పాఠశాలకు పంపే విధంగా ఉపాధ్యాయులు ప్రేరణ కల్పిస్తున్నారని చెప్పారు.

క్లుప్తంగా

చట్టబద్ధమైన పాలనతో పటిష్టమైన న్యాయవ్యవస్థ

–కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి షేక్ ఇంతియాజ్



మాట్లాడుతున్న కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి షేక్ ఇంతియాజ్

గుంటూరు ఎడ్యుకేషన్: చట్టబద్ధమైన పాలనతో పటిష్టమైన న్యాయవ్యవస్థను నెలకొల్పగలమని వైఎస్సార్ కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి షేక్ ఇంతియాజ్ పేర్కొన్నారు. సోమవారం సాంబశివపేటలోని ఏసీ లా కళాశాలలో దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని "చట్టబద్ధపాలన–రాజ్యాంగం" అనే అంశంపై సదస్సు నిర్వహించారు. దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గెడ్డం ఝాన్సీ అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇంతియాజ్ మాట్లాడుతూ మన దేశంలో చట్టబద్ధపాలన అమలు చేయడంలో న్యాయవ్యవస్థ పటిష్టంగా పని చేస్తుందనీ, రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక అధికరణాలు, చట్టాలను చైతన్యవంతంగా అర్థం చేసుకుని ఉపయోగించుకోవాలన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ చట్టబద్ధమైన పాలనతోనే నాగరిక సమాజాభివృద్ధిని చూడగలమన్నారు. రాజ్యాంగబద్ధమైన సమాజం లేకుంటే మానవ సమాజం అధోగతి పాలవుతుందని, ఆటవిక పాలనతో ప్రజలు అనేక కష్టాల పాలవుతారని అన్నారు. చట్టబద్ధ పాలన లేకుంటే దళితులపై దాడులు మరింతగా జరిగేవన్నారు. రాజ్యాంగాన్ని అమలు చేయడం ద్వారానే సమ సమాజం ఏర్పడి, సమాజంలోని ప్రతి ఒక్కరికీ అన్ని రంగాల్లో అవకాశాలు దక్కుతున్నాయని తెలిపారు. ఏసీ లా కళాశాల కరస్పాండెంట్ జి.ఎలీషా మాట్లాడుతూ మనుషులందరు సమానులే అనే సౌభ్రాతృత్వ భావన లేకపోతే దేశం అభివృద్ధి చెందదని అన్నారు. మహిళలు సమానత్వం సాధించడంలో దళిత స్త్రీ శక్తి చేస్తున్న పోరాటాలు చాలా అవసరమన్నారు. సభాధ్యక్షురాలు గెడ్డం ఝాన్సీ మాట్లాడుతూ మహిళలపై జరిగే అన్ని రకాల హింసను రూపుమాపేందుకు అంతర్జాతీయంగా చేపట్టిన ప్రచారోద్యమంలో భాగంగా దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు 16 రోజుల పాటు దళిత, ఆదివాసీ స్త్రీలపై హింసకు వ్యతిరేకంగా ప్రచార ఉద్యమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. సదస్సులో ఏసీ లా కళాశాల ప్రిన్సిపాల్ అమృతవర్షిణి, ఏఎస్‌యూ లా అసోసియేట్ ప్రొఫెసర్ సతీష్, అమల కుమారి, పలువురు న్యాయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్జీలకు సకాలంలో స్పందించండి

- జిల్లా ఏఎస్పీ ఎ.శ్రీనివాసరావు (క్రైం) ఆదేశం
- 'జగనన్నకు చెబుదాం' (స్పందన) కార్యక్రమం

నగరంపాలెం: లీజుకి తీసుకున్న స్థలంపై వివాదం సృష్టిస్తున్నారంటూ ఓ మహిళ జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం జరిగిన 'జగనన్నకు చెబుదాం' (స్పందన) కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. బాధితుల నుంచి జిల్లా ఏఎస్పీ ఎ.శ్రీనివాసరావు (క్రైం) అర్జీలు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆయా సబ్ డివిజన్లు/ పోలీస్‌స్టేషన్ల పోలీస్ అధికారులతో మొబైల్‌ఫోన్లు, వీసీ ద్వారా ఏఎస్పీ మాట్లాడారు. స్పందనకు వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఏ ఒక్కరి పట్ల అమర్యాదగా ప్రవర్తించవద్దని చెప్పారు. సాధ్యమైనంత త్వరగా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీఎస్పీలు ప్రకాష్‌బాబు (క్రైం), బాలసుందరరావు (ట్రాఫిక్) అర్జీలు స్వీకరించారు.

లీజు స్థలంపై..

రెండు నెలలు క్రితం వెంగళాయపాలెం రోడ్‌లో చింతపల్లి రామకృష్ణకు చెందిన సుమారు 100 చ.గ స్థలాన్ని లీజుకి తీసుకుని డాక్యుమెంట్స్ రాసుకున్నాం. స్థలంలో ఏదైనా చిల్లర దుకాణం ఏర్పాటు చేసుకుని, కుటుంబ జీవనం కొనసాగించాలని నిర్ణయించుకున్నాం. ఈనెల 20న భర్త వెంకటేశ్‌తో కలిసి స్థలం శుభ్రం చేసుకునే క్రమంలో ఓ దంపతులు, వారి స్నేహితులు, మరో వ్యక్తి, ఆయన అనుచరులు వచ్చారు. మా స్థలంలోకి వస్తున్నారు మీరెవరంటూ అసభ్యంగా, కులం పేరుతో సదరు దంపతులు తమను దూషించారు. దీంతో వారితో ఏం మాట్లాడకుండా స్కూటీపై వెళ్తుండగా అడ్డగించి మరింతగా భయభ్రాంతులకు గురిచేశారు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాం. సదరు దంపతులు, వారి అనుచరులు పోలీసుల కంటపడకుండా తిరుగుతున్నారు. పోలీస్ స్పందనలో ఫిర్యాదు చేద్దామనే ఆలోచనతో ఉన్నట్లు అవతలి వ్యక్తులు తెలుసుకుని మా ఇంటి వద్దకు వచ్చారు. స్పందనలో ఫిర్యాదు చేసినా, స్థలం వద్దకు వచ్చినా సహించేది లేదని బెదిరించారు. సదరు వ్యక్తుల నుంచి తమకు ప్రాణహాని ఉందని, తగు న్యాయం చేయగలరు

– పమిడిమర్రి ధనలక్ష్మి, నగరంపాలెం



అర్జీదారు రామయ్యతో మాట్లాడుతున్న జిల్లా ఏఎస్పీ శ్రీనివాసరావు

వాట్సాప్‌లో పరిచయమై..

ఈ ఏడాది ఫిబ్రవరిలో వాట్సాప్ ద్వారా ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. ఫోన్ చేసి మాట్లాడేవారు. వారం రోజులయ్యాక ఓ కొరియర్ నుంచి ఫోన్ వచ్చింది. పరిచయమైన వ్యక్తి నుంచి ల్యాప్‌ట్యాప్, ఐఫోన్ వచ్చిందని, అందుకు ఎక్సైజ్ పన్ను రూ.25 వేలు చెల్లించాలని అడగ్గా చెల్లించా. తర్వాత మరో పన్ను అంటూ సుమారుగా రూ.90 వేలు లాగేసుకున్నారు. అనంతరం అతని ఫోన్ నంబర్ బ్లాక్ చేయగా, మరలా ఆగస్టులో కాల్ చేసి, బ్యాంక్ ఖాతా తెరిచి నంబర్ పంపిస్తే అందులో నగదు పంపిస్తానని నమ్మబలికాడు. ఒక బ్యాంక్ ఖాతా తెరవగా, మళ్లీ మరో ఖాతా కూడా తెరవాలని చెప్పాడు. దీంతో రెండు బ్యాంక్‌ల ఖాతాల వివరాలతో సహా పరిచయమైన వ్యక్తికి పంపించా. కొద్దినెలలు గడిచాక ఆ బ్యాంక్ పుస్తకాలు పరిశీలించగా, ఆ పుస్తకాల ఖాతాలపై సుమారు రూ.4 లక్షల లావాదేవీలు జరిగినట్లు గుర్తించాం. సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.

–ఓ మహిళ, బ్రాడిపేట.

చిట్టీ డబ్బులు ఇవ్వడం లేదు..

కూలీ పనులు చేసుకుని జీవించే వాళ్లం. తెలిసిన వ్యక్తి ద్వారా ఇద్దరి వద్ద చిట్టీ వేశాం. రూ.2 లక్షల చిట్టీకి 14 నెలలు నగదు చెల్లించి, 15 నెలల్లో చిట్టీ పాడుకున్నాం. పాడుకున్న డబ్బులు వెంటనే చెల్లిస్తామని నిర్వాహకులు హామీ యిచ్చారు. ఇప్పటికి రెండు నెలలు గడిచినా నగదు ఊసేలేదు. అదేమని అడిగితే మాపై కేసులు నమోదు చేయిస్తామని నిర్వాహకుల్లో ఒకరూ బెదిరిస్తున్నారు.

– కె.తిరుపతిరావు, పద్మ, శ్యామలానగర్ ఒకటో వీధి.

ఆస్తి పత్రాలతో ఉడాయించారు

ఇంటి వద్ద ఇస్త్రీ చేసేవాడ్ని. గతనెలలో అనారోగ్య పరిస్థితుల దృష్ట్యా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరాను. ఇంట్లో ఎవరూలేని సమయంలో తెలిసిన వారే ఇంట్లో దాచిన ఆస్తి పత్రాలను దొంగలించారు. పత్రాలు ఇవ్వమని ఆమెను అడిగితే దురుసుగా ప్రవర్తించింది. అనారోగ్యం నుంచి బయటపడేందుకు సుమారు రూ.4 లక్షలు వరకు అప్పులు చేసి చికిత్స చేయించుకున్నా. న్యాయం చేయాలి. జిల్లా ఎస్పీ కార్యాలయ ఆవరణలోని సమావేశం మందిరంలో అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా ఏఎస్పీ (క్రైం) ఎ.శ్రీనివాసరావు బయటకు వచ్చారు. చెట్టు కింద వేచిఉన్న బాధితుని వద్ద అర్జీ స్వీకరించి, తగు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

– దశరథ రామయ్య, నెహ్రూనగర్.

వెలకట్టలేం.. పూర్వ విద్యార్థుల సాయం

వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేస్తున్న సాయం వెల కట్టలేనిదని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి అన్నారు. సోమవారం వైద్య కళాశాలలో రూ. 15 లక్షలతో ఆధునీకీకరించిన ఫోరెన్సిక్ మెడిసిన్ లెక్చర్ గ్యాలరీని ప్రిన్సిపాల్ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి మాట్లాడుతూ వైద్య కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ పాదిల ప్రసాద్ అమెరికాలో స్థిరపడి లెక్చర్ గ్యాలరీ ఆధునీకరణ కోసం రూ. 15 లక్షలు విరాళం ఇచ్చారన్నారు. అమెరికాలో స్థిరపడిన వైద్య కళాశాల పూర్వ విద్యార్థులు ఎంతో మంది కళాశాల అభివృద్ధికి అనునిత్యం కృషి చేస్తూనే ఉన్నారని గుర్తు చేశారు. వైద్య కళాశాలలో జింఖానా ఆడిటోరియం, పలు వైద్య విభాగాల ఆధునీకరణ, జీజీహెచ్‌లో డాక్టర్ పాదిల ప్రసాద్ భవన నిర్మాణాలు పూర్వ విద్యార్థుల సహాయంతోనే జరిగాయన్నారు. సుమారు రూ. 80 కోట్లతో నిర్మాణం చేస్తున్న మాతా శిశు సంరక్షణ కేంద్రం సైతం పూర్వ వైద్య విద్యార్థుల విరాళాలతోనే జరుగుతున్నట్లు వెల్లడించారు. తాము చదువుకున్న సంస్థలో ప్రస్తుతం ఉన్న విద్యార్థులు అత్యాధునిక వైద్య సౌకర్యాలతో వైద్య విద్యను పొందాలని, ఆసుపత్రికి వచ్చే రోగులు సైతం ఆధునిక సౌకర్యాలతో వైద్య సేవలు పొందాలనే మంచి ఆశయంతో పూర్వ వైద్య విద్యార్థులు కళాశాల అభివృద్ధికి, ఆసుపత్రి అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ శరత్‌చంద్ర, డాక్టర్ సుజ్ఞాన్, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ జ్యోతి స్వర్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.



ఆధునికీకరించిన లెక్చర్ గ్యాలరీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి

డీఆర్‌ఎం కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): ప్రతిఏటా నవంబర్ 26న రాజ్యాంగాన్ని ఆమోదించిన సందర్భంగా రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని డివిజన్ డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని రైల్వే డివిజన్ డీఆర్‌ఎం కార్యాలయంలో సోమవారం రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకున్నారు. డీఆర్‌ఎం మాట్లాడుతూ రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా భారత ప్రభుత్వం 2015 నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సంగా ప్రకటించడం జరిగిందన్నారు. దేశం సార్వభౌమ ప్రజాస్వామ్య లౌకిక సామ్యవాద గణతంత్ర రాజ్యమని రాజ్యాంగ ప్రవేశిక వివరిస్తోందన్నారు. ఆదేశిక సూత్రాలు న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, ప్రజలందరికీ సాంఘిక ఆర్థిక రాజకీయ న్యాయం చేకూరాలని కోరడం జరిగిందన్నారు. భారత రాజ్యాంగం పౌరులందరికీ ప్రాథమిక హక్కులు ఇవ్వడంతో పాటు నిమ్నకులాలకు బలహీన వర్గాలకు, మహిళలకు అల్ప సంఖ్యాకులకు ప్రత్యేక రక్షణ కల్పించిందన్నారు. అనంతరం రాజ్యాంగ ప్రతిజ్ఞను సంబంధిత అధికారులతో కలిసి చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధికారులు సీనియర్ డీపీఓ హనూర్, ఏడీఆర్‌ఎం పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న డీఆర్‌ఎం రామకృష్ణ

రజకులను టీడీపీ ఓటు బ్యాంకుగా వాడుకుంది

ఏపీ రజక సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు పాతపాటి అంజిబాబు

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): తెలుగుదేశం పార్టీ రజకులను ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంది తప్ప రజకులకు ఏమైనా న్యాయం చేసిందా అని ఏపీ రజక సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు పాతపాటి అంజిబాబు ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం అరండల్ పేటలో రజక సంఘాల నాయకులతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కులాలు మాకు బ్యాక్ బోన్ లాంటివి అని చెప్పుకునే టీడీపీ పార్టీ రజకుల ఐక్యత కోసం రజక మహాసభ ఏర్పాటు చేస్తే ఒక్క టీడీపీ నాయకులైన హాజరయ్యారా అని ప్రశ్నించారు. రజకులకు 50 సంవత్సరాలకే పెన్షన్ సదుపాయం కల్పిస్తామని చెప్పి నన్ను టీడీపీ పార్టీలోకి ఆహ్వానించి రజకులకు పెన్షన్ ఇవ్వకుండా మభ్య పెట్టారని మండిపడ్డారు. గుంటూరు నగరంలో రజకుల చెరువు ఆక్రమించి టీడీపీ కార్యాలయం కట్టిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అచ్చంనాయుడు కుటుంబంలో మూడు ఎమ్మెల్యే టికెట్లు, ఒక ఎంపీ టికెట్ ఇచ్చారని వారి కంటే ఎక్కువ జనాభా గల మాకు ఎందుకు ప్రాధాన్యత ఇవ్వలేకపోతున్నారని మండిపడ్డారు.

రాష్ట్ర జనాభాలో 4.7 శాతం ఉన్న రజకులకు ఒక ఎమ్మెల్యే, ఎంపీ టికెట్, కార్పొరేషన్ చైర్మన్ ఇచ్చారా అని ప్రశ్నించారు. టీడీపీలో రజకులను ఎదగనీయకుండా కొన్ని దుష్టశక్తులు అడ్డుపడుతున్నాయన్నారు. రజకులను ఎస్సీ జాబితాలో చేరుస్తామని రజకుల ఓట్ల కోసం టీడీపీ కుయుక్తులు పన్నుతోందని దీనికి రజకులంతా తగిన బుద్ధి చెప్పాలన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న అంజిబాబు

తండా నుంచి ఎదిగిన ప్రజావైద్యుడు

- డాక్టర్ శ్రీను నాయక్
- 28న హనుమాన్‌పాలెం సుగాలీతండాలో విగ్రహావిష్కరణ

తెనాలి: కనీస సౌకర్యాలు కూడా లేనిరోజుల్లో కొల్లిపర మండలంలోని మారుమూల గ్రామం హనుమాన్ పాలెంలో సుగాలీ తండాలో జన్మించిన భూక్యా శ్రీనునాయక్ .... స్వశక్తితో చదువుకుని వైద్యవిద్యను అభ్యసించారు. తమలాంటి ఎందరో పేదలకు వైద్యం చేస్తూ ప్రజావైద్యునిగా కీర్తిని పొందారు. గుంటూరులోని ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా సేవలనందిస్తూ, గతేడాది నవంబరు 9న తుదిశ్వాస విడిచారు. ఆయన స్మారకార్థం ప్రథమ వర్ధంతి సందర్భంగా ఈనెల 28వ తేదీ సాయంత్రం ఆయన జన్మించిన హనుమాన్‌పాలెం సుగాలీ తండాలో పాలరాతి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. డాక్టర్ నాయక్ తండ్రి ఎక్సైజ్ కానిస్టేబుల్, తల్లి గృహిణి, రేపల్లె మండలంలోని లయోల పాఠశాలలో 5వ తరగతి వరకు ప్రాథమిక విద్యనభ్యసించారు. కష్టపడి చదివి జవహర్ నవోదయ పాఠశాలకు ఎంపికై 6–12వ తరగతి వరకు చిలకలూరిపేట మండలం మద్దిరాల గ్రామంలో పూర్తి చేశారు. 1995 ఎంసెట్‌లో ర్యాంకును సాధించి, గుంటూరు మెడికల్ కాలేజీలో వైద్యవిద్యలో సీటు సాధించారు. 2001లో ఎంబీబీఎస్ పూర్తిచేసి అదే సంవత్సరం రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన వైద్యునిగా నియమితులయ్యారు. తర్వాత మందపాడు, రెంటచింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, జిల్లా కేంద్రంలోని గుంటూరు జైలు వైద్యునిగా పనిచేశారు. తన కుటుంబంలోని ఇతర తోబుట్టువులను చదివించి ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపరిచేందుకు తన కుటుంబానికి చేయూత నిచ్చారు. 2007లో ఫిరంగిపురం మండలం నుదురుపాడు పీహెచ్‌సీలో పని చేస్తుండగా ఉత్తమ వైద్యుడు అవార్డు అందుకున్నారు. 2006లో గుంటూరు చైతన్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవి జాస్తిని వివాహమాడారు. 2012లో ఫోరెన్సిక్ మెడిసిన్లో పీజీ సీటు సాధించి, అది పూర్తయ్యాక, 2015లో గుంటూరు సమగ్ర ప్రభుత్వ వైద్యశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. 2022లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. పేదలపట్ల అతనికి గల ప్రేమాభిమానాలతో సొంత కుటుంబసభ్యుల్లా వైద్యం అందిస్తున్న ప్రజావైద్యుడిగా పేరుతెచ్చుకున్నారు. 2022 నవంబరు 9న తుదిశ్వాస విడిచారు. మొత్తం కుటుంబం, స్నేహితులు,శ్రేయోభిలాషులు విషాదంలో మునిగిపోయారు. ఆయన చేసిన మంచి పనులను స్మరించుకుంటూ ఆయన సతీమణి డాక్టర్ శ్రీను నాయక్ స్వగ్రామంలో మహల్ నిర్మించి, ప్రథమ వర్ధంతి సందర్భంగా ఈ నెల 28 సాయంత్రం ఏడు గంటలకు పాలరాతి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు.



డాక్టర్ భూక్యా శ్రీనునాయక్

గుంటూరు యువకుడికి ఆస్ట్రేలియా అవార్డు

వాతావరణ మార్పులపై పరిశోధనకుగాను..



ఎస్.వి.శరత్‌చంద్ర

గుంటూరు మెడికల్: వాతావరణ మార్పులపై గుంటూరుకు చెందిన ఎస్.వి.శరత్‌చంద్ర చేసిన పరిశోధనకు ఆస్ట్రేలియాలోని గ్రిఫిత్ విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేట్ రీసెర్చ్ స్కాలర్‌షిప్‌ను, పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంటర్నేషనల్ రీసెర్చ్ స్కాలర్‌షిప్‌లను అందజేసింది. ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న, తక్కువ అభివృద్ధి చెందిన దేశాల్లో హీట్ హెల్త్ యాక్షన్ ప్లాన్ పరిశీలించడానికి, విపరీతమైన వేడి మానవులను ఎలా ప్రభావితం చేస్తోందో పరిశీలించడానికి ఆస్ట్రేలియాలోని గ్రిఫిత్ విశ్వవిద్యాలయంలో డాక్టర్ షానన్ రూథర్‌ఫోర్డ్, డాక్టర్ హోక్, డాక్టర్ ఎడ్ మోర్గాన్‌లు పరిశోధన చేస్తున్నారు. వారి పర్యవేక్షణలో శరత్‌చంద్ర తన పరిశోధన పత్రాలను సమర్పించారు. గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ నాగార్జునకొండ వెంకట సుందరాచారి, డాక్టర్ జ్యోతిల తనయుడు ఎన్.వి.శరత్‌చంద్ర రూర్కెలాలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బయోటెక్నాలజీలో బీటెక్ చదివాడు. అనంతరం రాజకీయ శాస్త్రంలో మాస్టర్ డిగ్రీ, హైదరాబాద్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో వాతావరణ మార్పులో ఎంటెక్ మాస్టర్ డిగ్రీ చదివాడు. వాతావరణ మార్పుకు సంబంధించి అంతర్జాతీయ ప్రాజెక్టుల్లో పరిశోధకుడిగా పనిచేశాడు. విపరీతమైన వేడి, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు మానవ ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతాయని శరత్‌చంద్ర తెలిపాడు.

అందరం కలిసి ఈ సమస్యను పరిష్కరించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రెండు ప్రతిష్టాత్మకమైన ఆస్ట్రేలియన్ పరిశోధన అవార్డులను అందుకున్న శరత్‌చంద్రకు గుంటూరుకు చెందిన పలువురు వైద్యులు అభినందనలు తెలిపారు.